RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

## ఇంధనంపై పుకార్లు అబద్ధం, ప్రజలు భయపడవద్దు




(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 25:- ఫ్యూచర్ సిటీ, రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత ఉందంటూ సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు పూర్తిగా అసత్యమని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు తెలిపారు. తెలంగాణ పెట్రోలియం డీలర్ల సంఘంతో కలిసి ఆయన ప్రజలకు స్పష్టమైన సందేశం ఇచ్చారు.రాష్ట్రంలో ఇంధన నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, సరఫరా ఎక్కడా ఆగలేదని అధికారులు పేర్కొన్నారు. ఆయిల్ కంపెనీల నుండి పెట్రోల్ బంకులకు నిరంతరాయంగా సరఫరా జరుగుతోందని వివరించారు.అయితే కొరత ఉందన్న భయంతో ప్రజలు ఒకేసారి బంకులకు చేరుకోవడం వల్లే కొన్ని చోట్ల రద్దీ పెరుగుతోందని తెలిపారు. దీనివల్ల కొన్ని బంకుల్లో తాత్కాలికంగా నిల్వలు తగ్గుతున్నాయే తప్ప అసలు కొరత లేదని స్పష్టం చేశారు. ఇంధనాన్ని డబ్బాలు, క్యాన్లలో నిల్వ చేయడం చట్టవిరుద్ధమని, ఇది ప్రమాదకరమని హెచ్చరించారు. ఇలా చేయడం వల్ల అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని చెప్పారు. ఇంధన కొరతపై తప్పుడు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు తప్పుడు వార్తలను నమ్మకుండా, అవసరమైనంత మాత్రమే ఇంధనం తీసుకోవాలని సూచించారు.ప్రజలు బాధ్యతగా వ్యవహరించి పుకార్లకు లోనుకాకుండా ప్రశాంతంగా ఉండాలని అధికారులు కోరారు.

## శ్రీరామనవమి రోజున కవితక్క కొత్త పార్టీ ప్రకటన, 27న కీలక ప్రకటనకు ముహూర్తం



(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 25:- హైదరాబాద్: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు శ్రీమతి కవితక్క కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు దిశగా కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ నెల 27న శ్రీరామనవమి సందర్భంగా పార్టీకి సంబంధించిన అధికారిక ప్రకటన చేసే అవకాశముందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. శ్రీరామనవమి రోజు ఉదయం సుమారు 8 గంటలకు కొత్త పార్టీ ఏర్పాటు తేదీని ప్రకటించే అవకాశం ఉందని తెలంగాణ జాగృతి వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ సందర్భంగా పార్టీ సిద్ధాంతాలు, విధివిధానాలు, లక్ష్యాలను వివరించే అవకాశమున్నట్లు తెలుస్తోంది.అలాగే, తన నివాసం నుంచే పార్టీ పేరు, ఎన్నికల గుర్తు (సింబల్) ప్రకటించే అవకాశముందని సమాచారం. ఇదే వేదికగా కవితక్క తాను పోటీ చేసే నియోజకవర్గాన్ని కూడా వెల్లడించే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.ఈ ప్రకటనతో తెలంగాణ రాజకీయాల్లో కొత్త మార్పులు చోటుచేసుకునే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందజేత

**మర్రి నిరంజన్ రెడ్డి చేతుల మీదుగా చెక్కుల అందజేత**



(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 25:-ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో వైద్య ఖర్చుల కోసం సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆదిభట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో దరఖాస్తులు సమర్పించగా, తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో ఈ నిధులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా పోల్కంపల్లి గ్రామానికి చెందిన పంది అండాలు గారికి రూ.50,500, ఎల్లమ్మ తాండ గ్రామానికి చెందిన సపావట్ కవితకి రూ.60,000, నల్లవెల్లి గ్రామానికి చెందిన దేరంగుల స్వప్నకి రూ.60,000, యాచారం గ్రామానికి చెందిన ఆనంద్ రెడ్డికి రూ.60,000, తమ్మలోని గూడెం గ్రామానికి చెందిన దేంది సూర్యకళకి రూ.50,000, అబ్దుల్లాపూర్మెట్ గ్రామానికి చెందిన వెంకటరెడ్డికి రూ.60,000 చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,
పార్టీ కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు. లబ్ధిదారులు తమకు అందిన ఆర్థిక సహాయానికి రాష్ట్ర ప్రభుత్వం, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## కి.జీహెచ్ఎంసీ చుట్టుపక్కల 8మీ ప్రాంతాలకు 24% హెచ్ఆర్ఏ అమలు చేయాలి



(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 25:-ఐడీఓసీ, కొంగరకలాన్‌లో జరిగిన రంగారెడ్డి జిల్లా టీజీవో అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో కీలక తీర్మానం చేయబడింది. విస్తరించిన జీహెచ్ఎంసీ పరిధి చుట్టూ 8 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ప్రాంతాలకు ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని 24% ఇంటి అద్దె భత్యం (హెచ్ఆర్ఏ) మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.జీఓ ఎంఎస్ నెం. 53, ఆర్థిక శాఖ, తేదీ 11.06.2021 ప్రకారం ఈ డిమాండ్‌ను త్వరగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ తరపున జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి డిఆర్ఓ సంగీత ద్వారా వినతి పత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో టీజీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కే రామారావు, కార్యదర్శి శ్రీనేష్ కుమార్ నోరి, నూతనకంటి వెంకట్, అలివేలు, సైదమ్మ, రాకేష్, పావని, ఉమ, బాలేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల నేతన్నల కోసం కేటీఆర్ గళం

**- రూ.38 కోట్ల విద్యుత్ భారం రద్దుకు డిమాండ్**



(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 25:-రాజన్న సిరిసిల్ల జిల్లా వస్త్ర పరిశ్రమ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన నేపథ్యంలో, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి. రామారావు కీలకంగా స్పందించారు. సిరిసిల్ల నేతన్నల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావులను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, సిరిసిల్ల వస్త్ర పరిశ్రమపై పడిన రూ. 38 కోట్ల విద్యుత్ భారం నేతన్నలపై తీవ్ర ఒత్తిడిని కలిగిస్తోందని తెలిపారు. ఈ మొత్తం వెంటనే రద్దు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా, గతంలో విధించిన బ్యాక్ బిల్లింగ్ మరియు సర్‌ఛార్జీ మొత్తాలను పూర్తిగా మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.పాత బకాయిల కారణంగా వస్త్ర పరిశ్రమ యజమానులు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి పరిస్థితులు లేకుండా పాత బకాయిలతో సంబంధం లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సబ్సిడీ ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కేటీఆర్ సూచించారు. సిరిసిల్ల నేతన్నలు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు మరింత తీవ్రమవుతున్నాయని, గతంలో జరిగినట్లుగా కార్మికులు ఆత్మహత్యల బాట పట్టే పరిస్థితులు మళ్లీ రాకుండా తక్షణ ఆర్థిక సహాయం అందించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. నేతన్నల జీవనోపాధి కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ సమావేశం ద్వారా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సమస్యలపై ప్రభుత్వ దృష్టి మరింతగా కేంద్రీకృతమై, తక్షణ పరిష్కార చర్యలు తీసుకుంటుందని నేతన్నలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఇంధన నిల్వలపై సీఎం రేవంత్ రెడ్డి అత్యవసర సమీక్ష



(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 25:-పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో పెట్రోల్, ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్లు, యూరియా వంటి అవసరమైన వస్తువుల సరఫరాపై ఎలాంటి ప్రభావం పడకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అత్యవసర ఉన్నతస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశం మధ్యాహ్నం 2 గంటలకు శాసనసభ కమిటీ హాలులో నిర్వహించబడనుంది. ఈ సమావేశానికి సంబంధిత శాఖల మంత్రులు, ఉన్నతాధికారులు హాజరై ప్రస్తుత పరిస్థితిని సమగ్రంగా సమీక్షించనున్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో ఇంధన సరఫరా నిరంతరంగా కొనసాగేందుకు తీసుకోవాల్సిన చర్యలు, నిల్వల నిర్వహణ, సరఫరా గొలుసులో ఎటువంటి అంతరాయం లేకుండా చూడాల్సిన అంశాలపై చర్చించనున్నారు.పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ గ్యాస్ సరఫరా విషయంలో ప్రజల్లో ఎలాంటి ఆందోళన కలగకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించే అవకాశం ఉంది. అంతేకాకుండా వ్యవసాయ రంగానికి కీలకమైన యూరియా ఎరువుల నిల్వలపై కూడా ప్రత్యేక దృష్టి సారించి, రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించనున్నారు.పశ్చిమాసియా పరిస్థితుల ప్రభావం దేశవ్యాప్తంగా ఇంధన సరఫరాపై పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగా అప్రమత్తమై చర్యలు చేపడుతున్నట్లు ఈ సమావేశం ద్వారా స్పష్టమవుతోంది. ప్రజలకు అవసరమైన అన్ని వనరులు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

# 12 అంతస్తుల ప్రాజెక్టు నిర్మాణం అనేక అనుమానాలకు తావిస్తుంది

**- డాక్టర్ పిట్టా వరప్రసాద్**



హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి కాకినాడ :కాకినాడ నగరంలో ఇప్పటివరకు ఆరు అంతస్తులకంటే ఎక్కువ భవనాలు నిర్మాణం జరగని పరిస్థితుల్లో, ఇప్పుడు 12 అంతస్తులతో భారీ ప్రాజెక్ట్ నిర్మాణం జరగడం అనేక అనుమానాలకు తావిస్తోంది అని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పిట్టా వరప్రసాద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.సి ఆర్ సి టి, ఆటోనగర్, మాధవపట్నం ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఈ భారీ ప్రాజెక్టుకు సంబంధించి జిల్లా కలెక్టర్ కార్యాలయం, ఫైర్ డిపార్ట్మెంట్, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు ఎలాంటి ప్రమాణాలు పాటించి అనుమతులు ఇచ్చారో ప్రజలకు స్పష్టంగా చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు."ఇప్పటివరకు 6 ఫ్లోర్లకు మించి నిర్మాణాలు లేని నగరంలో ఒక్కసారిగా 12 అంతస్తుల భవనానికి అనుమతులు ఇవ్వడం వెనుక భారీ స్థాయిలో అక్రమాలు, అవినీతి జరిగి ఉండే అవకాశాలు ఉన్నాయనే అనుమానం ప్రజల్లో వ్యక్తమవుతోంది" అని ఆయన పేర్కొన్నారు.గతంలో కాకినాడలో సినిమా రోడ్‌లో దేవి--శ్రీదేవి థియేటర్ల పక్కన ఉన్న భాస్కర అపార్ట్‌మెంట్స్‌లో బేస్‌మెంట్ పిల్లర్స్ పగుళ్లు రావడంతో భవనం ప్రమాదకర స్థితికి చేరి, అందులో నివసిస్తున్న వారందరినీ ఖాళీ చేయించిన ఘటనను ఆయన గుర్తు చేశారు.ఆ ఘటనలో బాధితులకు ఇప్పటివరకు సరైన నష్టపరిహారం కూడా అందకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం అని ఆయన విమర్శించారు.అదేవిధంగా, శశికాంత్ నగర్‌లో ఉన్న శ్యామల సదన్ భవనం కృంగిపోయిన సందర్భంలో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురైన విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు.ఇలాంటి ఘటనలు నిర్మాణాల్లో ఉన్న లోపాలు, పర్యవేక్షణలో ఉన్న నిర్లక్ష్యం ఎంత ప్రమాదకరమో స్పష్టంగా చూపిస్తున్నాయని అన్నారు.

ఇలాంటి ప్రమాదకర ఘటనలు జరుగుతున్నప్పటికీ, ఇప్పుడు 12 అంతస్తుల హై రైజ్ భవనాలకు అనుమతులు ఇవ్వడం ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టే చర్యగా భావించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

ఈ నేపథ్యంలో సంబంధిత శాఖలకు సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తులు సమర్పించామని, నిజాలు వెలుగులోకి రాకపోతే పెద్ద స్థాయిలో ప్రజా ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు."ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడే అనుమతులను మేము ఎట్టి పరిస్థితుల్లోనూ సహించము. అవసరమైతే కోర్టు తలుపులు తట్టడానికి కూడా వెనుకాడము" అని డాక్టర్ పిట్టా వరప్రసాద్ గట్టిగా హెచ్చరించారు.ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి




**- సికింద్రాబాద్ జోన్ డీసీసీ రక్షితమూర్తి ఐపిఎస్**

హైదరాబాద్, మార్చి 25: పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షిత మూర్తి ఐపిఎస్ అన్నారు. శ్రీరామనవమి, హనుమాన్ జయంతి సందర్భంగా సెంట్రల్ పీస్ కమిటీ ఆధ్వర్యంలో అంబర్ పేట ఏకె ఫంక్షన్ ప్లాజాలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. శ్రీరామనవమి, హనుమాన్ జయంతి వేడుకలకు భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. పోలీసులకు ప్రజలు సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సెంట్రల్ పీస్ కమిటీ అధ్యక్షుడు ఎస్. నారాయణ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్. శరత్ శ్యామ్, ఆడిషనల్ డీసీపీ జె.నర్సయ్య, చిక్కడపల్లి ఏసీపీ ఎల్.రమేష్ కుమార్, వారసిగూడ ఏసీపీ శశాంక్ రెడ్డి, మహంకాళి ఏసీపీ సిహెచ్ శ్రీదర్, జి.జగన్, రాకేష్ అగర్వాల్, సయ్యద్ ఫరీదుద్దీన్ యునస్, అబ్దుల్ ఖాదర్, సయ్యద్ ఖలీద్ షా, ఎల్. శ్రీలత, బసంత్ కౌర్, మున్నానాయక్, చంద్రశేఖర్, ఆరాఫత్, జలందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్ కొరత లేదు




**- వదంతులను నమ్మవద్దు**

**- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**

హైద్రాబాద్ ఎస్టేట్ వరంగల్ ప్రతినిధి ప్రకాష్ : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పెట్రోల్, డీజిల్ కొరత లేదని వరంగల్ సీపీ స్పష్టం చేశారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న వదంతుల వల్ల ప్రజలు ఆందోళనకు గురై ఒకేసారి పెద్ద సంఖ్యలో పెట్రోల్ బంకులకు వెళ్లి వాహనాల్లో ఫుల్ ట్యాంక్ నింపించుకుంటున్నారని తెలిపారు.దీంతో అనవసర రద్దీ ఏర్పడి సరఫరా వ్యవస్థకు అంతరాయం కలుగుతున్నదని పేర్కొన్నారు. వరంగల్ కమిషనరేట్ అన్ని పెట్రోల్ బంకుల్లో సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని, సరఫరా నిరంతరంగా కొనసాగుతున్నదని చెప్పారు. ఎటువంటి కొరత పరిస్థితి లేదని స్పష్టం చేశారు.

ప్రజలు అవసరానికి మించి ఇంధనం నిల్వ చేసుకోవద్దని, అలా చేయడం వల్ల ఇతరులకు ఇబ్బందులు కలుగుతాయని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మకూడదని, నిర్ధారించని సమాచారాన్ని షేర్ చేయడం ద్వారా గందరగోళం సృష్టించవద్దని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు అప్రమత్తంగా ఉన్నారని, వదంతులు వ్యాప్తి చేయడం లేదా ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

